క్లుప్తంగా

ముగిసిన దేవర్ల కొలుపు



విశేష అలంకరణలో అంకమ్మతల్లి

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు పట్టణంలో గత మూడు రోజులుగా జరుగుతున్న అంకమ్మ, మల్లెంకొండయ్య దేవర్ల కొలుపు మంగళవారం ముగిసింది. పట్టణంలోని అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి దంపతులు అమ్మవారికి చీరసారెలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం జరిగిన గ్రామోత్సవంలో మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి మంగళ హారతులు పట్టారు. మధ్యాహ్నం, రాత్రికి నిర్వాహకులు భక్తులకు అన్న సంతర్పణ ఏర్పాటు చేశారు.

ఘనంగా డాక్టర్స్ డే



కావలి: పట్టణంలో మంగళవారం డాక్టర్స్ డే ఘనంగా నిర్వహించారు. ప్రాంతీయ జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక రవి నర్సింగ్ హోమ్‌లో జేవీవీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్(కావలి), యూటీఎఫ్, పలు స్వచ్ఛంద సంస్థలు కలిసి డాక్టర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తదానం చేసే వారికి పలు సూచనలు చేశారు. 18 నుంచి 60 సంవత్సరాల లోపు వారు రక్తదానం చేయవచ్చన్నారు. షుగర్ ఉన్న వారు రక్తదానం చేయకూడదని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు బెజవాడ రవికుమార్, కె.సుబ్బారావు, కె.నళిని, పద్మ తదితరులు పాల్గొన్నారు.

బడి బాట ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

సంగం: 'మన ఊరు – మన బడి బాట' కార్యక్రమంలో భాగంగా సంగంలోని రాళ్లచెలిక ప్రాంతంలో అంగన్‌వాడీ సిబ్బంది మంగళవారం ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని తల్లిదండ్రులను కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఉచిత వైద్యశిబిరం



సోమశిల(చేజర్ల): చేజర్ల మండలం మామూడూరు గ్రామంలో మంగళవారం కిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. రోగులను పరీక్షించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో 130 మంది వైద్యపరీక్షలు చేయించుకున్నారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ వై.రవికిరణ్ పాల్గొని రోగులకు పరీక్షలు నిర్వహించారు. వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది.

'చెత్త' సంపద కేంద్రం



వింజమూరు(ఉదయగిరి): ఉదయగిరి నియోజకవర్గంలో జనాభా పరంగా పెద్ద మండలం వింజమూరు. ఈ పట్టణంలో నిత్యం టన్నుల కొద్ది చెత్త పేరుకుపోతోంది. ఈ వ్యర్థాలను ఎరువుగా మార్చేందుకు వింజమూరు బైపాస్ రోడ్డులో గత ప్రభుత్వం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం ఏర్పాటు చేసింది. ప్రారంభంలో ఈ కేంద్రంలో చెత్త నుంచి ఎరువు తయారు చేశారు. అప్పట్లో ఈ కేంద్రం జిల్లాస్థాయిలో మోడల్ కేంద్రంగా నిలిచి ఉత్తమ చెత్త సంపద కేంద్రం అవార్డును అందుకుంది. అయితే ఇటీవల నిర్వహణ గాడి తప్పింది. పంచాయతీ పాలకులు పట్టించుకోలేదు. దీంతో అక్కడ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిర్లక్ష్యానికి గురైంది. ఇప్పటికైనా పాలకులు స్పందించి నిరుపయోగంగా ఉన్న సంపద కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

తస్మాత్ జాగ్రత్త

- సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం
- దోమల వ్యాప్తితో పొంచి ఉన్న రోగాలు
- మలేరియా, డెంగీ, చికున్ గున్యాలపై అప్రమత్తం
- నీరు నిల్వ లేకుండా చూసుకోవడం ద్వారా నివారణ
- వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతే ప్రధానం



సీజనల్ వ్యాధులపై సీతారామపురం మండలంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది (ఫైల్)

ఉదయగిరి: వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవకాశం ఉంది. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలు, నివాస పరిసరాల్లో నీరు చేరుతోంది. తద్వారా దోమలు వృద్ధి చెంది వాటి ద్వారా మలేరియా, డెంగీ, టైఫాయిడ్, చికున్‌గున్యా తదితర వ్యాధులు ప్రబలుతాయని, దోమ కాటుకు గురికాకుండా, జ్వరాల బారిన పడకుండా ముందుస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

మారిన వాతావరణ పరిస్థితులతో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉంది. ఇళ్లు, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరం ఉంది. జాగ్రత్త పడకుంటే రోగాల బారిన పడి వైద్య ఖర్చులతో జేబులు ఖాళీ అయ్యే అవకాశం ఉంది.

ప్రజలు వ్యాధుల బారిన పడకుండా స్వీయ జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ప్రమాదకర వ్యాధులు

డెంగీ : పగలు కుట్టే ఎడిస్ ఈజిప్టి అనే దోమ కాటుతో ఈ వ్యాధి ప్రబలుతుంది. ఈ వ్యాధి సోకిన వారికి తీవ్రమైన జ్వరం, తలనొప్పి, కంటి లోపల కదలికల తగ్గదల, కండరాలు, కీళ్ల నొప్పులు, వాంతులు కావడం, నోరు ఎండిపోవడం లాంటి లక్షణాలు ఉంటాయి.

మలేరియా

అనాఫిలిస్ అనే ఆడ దోమ కుట్టడం వలన మలేరియా వ్యాధి వస్తోంది. ఈ వ్యాధి సోకితే చలి జ్వరం, విపరీతమైన తలనొప్పి తదితర లక్షణాలు ఉంటాయి.

చికున్ కున్యా

ఎడీస్ దోమ ద్వారా ఈ వ్యాధి ప్రబలుతోంది. అకస్మాత్తుగా తీవ్రమైన జ్వరం రావడం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు వంటి లక్షణాలు ఉంటాయి.

ఫైలేరియా

మురుగునీటితో పెరిగే క్యూలెక్స్ దోమ కాటుతో ఫైలేరియా వ్యాధి సోకుతోంది. మురుగు నీటిలో దోమల లార్వాలు వృద్ధి చెంది చెందకుండా కిరోసిన్, ఆయిల్ చల్లి దోమలు నివారించవచ్చు.

నివారణ చర్యలు

- ఇంటి పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం, నీటి తొట్టెలు, పాత టైర్లు, మురుగు కాలువల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి.
- దోమలు ఇంట్లోకి రాకుండా నియంత్రించేందుకు ఉదయం, సాయంత్రం కిటికీలు మూసివేయాలి.
- ప్రతి శుక్రవారం డ్రై డే పాటిస్తూ డ్రమ్ములు, గచ్చులు, ట్యాంక్‌ల్లో ఉన్న నీరు పారబోయాలి.
- దోమలు కుట్టకుండా దోమ తెరలు వినియోగించాలి.

ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం



వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. గ్రామాల్లో మలేరియా, డెంగీ, టైఫాయిడ్, చికున్‌గున్యా లాంటి వ్యాధులు రాకుండా వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రజలు ఇంటిని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే చాలా వ్యాధులు రాకుండా నియంత్రించవచ్చు.

– శ్వేత, వైద్యురాలు, వింజమూరు సీహెచ్‌సీ

హంస వాహనంపై ఆత్మారాముడు



హంస వాహనంపై విహరిస్తున్న ఆత్మారాముడు

సంగం: మండలంలోని అన్నారెడ్డిపాళెంలో ఆత్మారాముని ఉత్సవాల్లో భాగంగా సోమవారం అర్ధరాత్రి స్వామివారు హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత సీతా సమేతుడైన ఆత్మారాముడిని హంస వాహనంపై కొలువుదీర్చి భారీ గజమాలలతో సుందరంగా అలంకరించారు. వేదపండితులు ప్రత్యేక పూజల అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. ఆత్మారాముడికి భక్తులు నైవేద్యాలు సమర్పించి కర్పూర హారతులిచ్చారు.

కనియంపాడులో ఫ్యామిలీ డాక్టర్ వైద్యసేవలు



బీపీ పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

వరికుంటపాడు: మండలంలోని కనియంపాడు గ్రామంలో మంగళవారం వైద్యాధికారిణి ఆయేషా ఫ్యామిలీ డాక్టర్ వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా ఆమె 55 మంది రోగులకు వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. మారిన వాతావరణ పరిస్థితుల దృష్ట్యా దీర్ఘకాలిక రోగులు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. బీపీ, షుగర్ తదితర వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా మందులు వాడడంతోపాటు ప్రతి నెలా వైద్యపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఫ్యామిలీ డాక్టర్ వైద్యసేవలను ప్రజలు సద్వినియోగం చేసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సహాయకుడు రామరాజు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

చందనాలంకారంలో సంతానలక్ష్మి అమ్మవారు



ఉదయగిరి: పట్టణంలోని బీసీకాలనీ సమీపంలో ఉన్న శ్రీసంతానలక్ష్మి అమ్మవారి ఆలయంలో జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారు చందనాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు ఎల్‌వీ ప్రసాద్‌శర్మ వేకువనే అమ్మవారికి అభిషేకాలు, అలంకరణ, విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అయితా సుబ్బారావు–వెంకటలక్ష్మీకుమారి దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు. బుధవారం పసుపు కుంకుమ, ప్రధానోత్సవం, సంతానం లేని వారు వరపడడం, అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

సాగు యాజమాన్య పద్ధతులపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఆత్మ డిప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ శివన్నారాయణ.

సీతారామపురం: సజ్జ సాగులో యాజమాన్య పద్ధతులపై రైతులు అవగాహన కలిగి ఉండాలని ఆత్మ డిప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ శివన్నారాయణ తెలిపారు. ఆయన మంగళవారం మండలంలోని అయ్యవారిపల్లి రైతుభరోసా కేంద్రంలో రైతులతో సమావేశమై మాట్లాడారు. అనంతపురం జిల్లాలో విజయవంతమై మంచి దిగుబడి సాధించిన ఏబీవీ-04 రకం సజ్జ విత్తనాలను తొలిసారిగా జిల్లాలోని అయ్యవారిపల్లి ఆర్బీకేలో రైతులకు అందజేసినట్లు తెలిపారు. సరైన దిగుబడి పొందినట్లయితే ఇదే రకం విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. అలాగే రైతులకు సజ్జ విత్తనాల మినీ కిట్లను పంపిణీ చేశారు. అనంతరం పీఎం కిసాన్ నిధుల విడుదల కార్యక్రమాన్ని రైతులతో కలిసి వీక్షించారు. కార్యక్రమంలో అయ్యవారిపల్లి సర్పంచ్ దుగ్గయ్య, వీఏఏలు నరేంద్ర, లక్ష్మీనారాయణ, ఎంపీఈఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వాశిలి సచివాలయం పునఃప్రారంభం



వాశిలి సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు

ఆత్మకూరురూరల్: రాజకీయ వివాదాల కారణంగా ప్రైవేట్ అద్దె భవనంలో నిర్వహిస్తున్న వాశిలి సచివాలయ భవనానికి గత కొన్ని రోజులుగా ఇంటి యజమాని తాళాలు వేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆత్మకూరు ఎంపీడీఓ బాలాజీ నాయక్, వాశిలి సర్పంచ్ చెలిక రమా హరిబాబు చొరవతో మంగళవారం సచివాలయ భవనం తాళాలు తీసి సచివాలయ సేవలను ప్రారంభించారు. భవన యజమానితో మాట్లాడి పూర్తి బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకుంటామని, త్వరలోనే స్థానికంగా ఉన్న పంచాయతీ కార్యాలయానికి మరమ్మతులు చేయించి సచివాలయ సేవలు ఆ భవనంలో కొనసాగించేలా చర్యలు తీసుకుంటామని సర్పంచ్ ఈ సందర్భంగా తెలిపారు.

ముమ్మరంగా 'నేను బడికి పోతా'



బోయలచిరివెళ్లలో 'నేను బడికి పోతా' కార్యక్రమం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

ఆత్మకూరురూరల్: పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో 'నేను బడికి పోతా' పేరుతో పలు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులను పాఠశాలల్లో చేర్పుకునేందుకు మంగళవారం ముమ్మరంగా కార్యక్రమాలు చేపట్టారు. బోయలచిరివెళ్ల, మహిమలూరు, ఎల్‌ఆర్‌పల్లి, ఏసీఎస్ ఆర్‌కాలనీ తదితర ప్రాంతాల్లోని పాఠశాలల ఉపాధ్యాయులు 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని నిర్వహించి పలువురు విద్యార్థులను పాఠశాలల్లో చేర్పుకున్నారు.

బాధితుడికి చేయూత



బాధితుడికి నిత్యావసరాలు అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

ఆత్మకూరురూరల్: మండలంలోని కరటంపాడు పంచాయతీ పరిధిలో సాతానుపల్లికి చెందిన చింతా వెంకట్రావుకు ఇటీవల అనారోగ్యంతో కాలు తొలగించారు. నిరుపేద కుటుంబం కావడంతో ఆయన కుటుంబ పోషణకు ఇబ్బంది పడుతున్నారని తెలుసుకున్న ఆత్మకూరు పట్టణంలోని డాక్టర్ వింజం దొరసానమ్మ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ జాగర్లమూడి ప్రణీత్‌చౌదరి మంగళవారం ఆ కుటుంబానికి తనవంతు సాయం అందించారు. నెల రోజులకు సరిపడా నిత్యావసర సరుకులు, కూరగాయలు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రణీత్‌కు వెంకట్రావు కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు డాక్టర్ కుమార్, తోడేటి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సు

ఆత్మకూరురూరల్: పౌర్ణమిని పురస్కరించుకొని ఆత్మకూరు ఆర్టీసీ డిపో నుంచి అరుణాచలానికి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ కరిమున్నీసా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 21న ఉదయం 8 గంటలకు ఆత్మకూరు ఆర్టీసీ డిపో నుంచి బస్సు బయలుదేరుతుందని, టిక్కెట్ ధర రానుపోను ఒకరికి రూ.1,400గా నిర్ణయించామని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా రిజర్వేషన్ సౌకర్యం ఏర్పాటు చేశామని తెలిపారు. మార్గమధ్యంలో కాణిపాకం, సిరిపురం గోల్డెన్ టెంపుల్, అరుణాచలంలో ప్రదక్షిణం, దర్శనం చేసుకొనేందుకు భక్తులకు అవకాశం ఉందని తెలిపారు. అరుణాచలానికి వెళ్లాలనుకొనే భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వివరాలకు డిపో మేనేజర్ మొబైల్ నంబర్ 99592 25645, సీఐ మొబైల్ నంబర్ 99660 09395, బస్సు కండెక్టర్ మొబైల్ నంబర్ 7382883299లో సంప్రదించవచ్చని తెలిపారు.

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఉదయగిరి: మండలంలోని గండిపాళెం ఏపీ బాలుర గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి అర్హత కలిగిన గెస్ట్ టీచర్లు దరఖాస్తులు చేసుకోవచ్చని ప్రిన్సిపల్ పుష్పరాజ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో ఇంగ్లిష్-టీజీటీ, గణితం-పీజీటీ, బయొలాజికల్ సైన్స్-పీజీటీ, ఫిజికల్ సైన్స్-పీజీటీ, స్టాఫ్ నర్స్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తుతోపాటు విద్యార్హతల సర్టిఫికెట్స్ జెరాక్స్ కాపీలను జత చేసి ఈ నెల 24వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు పాఠశాలలో అందించాలని తెలిపారు.

21న యోగా దినోత్సవం

ఆత్మకూరురూరల్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఈ నెల 21న ఉదయం 6.30 నుంచి 7.30 గంటల వరకు ఆత్మకూరు పట్టణంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు కరటంపాటి సుధాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆత్మకూరు, పరిసర ప్రాంతాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పోలేరమ్మకు సద్ది సమర్పణ

సోమశిల: అనంతసాగరం మండలం పాతదేవరాయపల్లి గ్రామంలో వెలసిన శ్రీపోలేరమ్మ ఆలయం నిర్మించి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం వార్షికోత్సవ సంబరాలు నిర్వహించారు. ఉదయం మహిళలు సద్ది కుండలతో ఆలయం వద్దకు వచ్చి అమ్మవారికి సద్ది పోశారు. అనంతరం ఆ ప్రసాదాన్ని ఆలయం వద్ద ఉన్న భక్తులకు పంచిపెట్టారు. ఈ సద్ది కార్యక్రమం రెండు వారాలు జరిగిన అనంతరం అమ్మవారికి పొంగళ్లు సమర్పించనున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు.

ఎస్సీ కార్పొరేషన్ లోన్లు పునరుద్ధరించండి



అల్లూరు: కొత్తగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ లోన్లను పునరుద్ధరించాలని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు కోరారు. మంగళవారం ఆయన అల్లూరులో విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎస్సీ కార్పొరేషన్‌ను పునరుద్ధరించి ఎస్సీల అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కోవూరు బాబు, ముసలి నరేంద్ర, నక్క గిరి తదితరులు పాల్గొన్నారు.

గంగాభవాని అమ్మవారికి పొంగళ్లు



గంగాభవాని అమ్మవారి గ్రామోత్సవం



ఆలయం చుట్టూ తిరుగుతున్న బండ్లు

సీతారామపురం: మండలంలోని సింగారెడ్డిపల్లిలో మంగళవారం గంగాభవాని అమ్మవారికి పొంగళ్లు సమర్పించారు. సోమవారం రాత్రి అమ్మవారి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. మంగళవారం మహిళలు గంగమ్మ ఆలయం వద్దకు చేరుకొని పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. అలాగే పలువురు బండ్లు కట్టి వాటిని ప్రత్యేకంగా అలంకరించి తప్పెట్ల చప్పుళ్ల నడుమ ఆలయం వద్దకు చేరుకున్నారు. బండ్లతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. స్థానికులతోపాటు పరిసర గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అన్నదానంతోపాటు కాటంరాజు చరిత్ర, యాదవ పురాణ కథాకాలక్షేపం వంటి సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు బండరి భజన ఏర్పాటు చేశారు. దీంతో గత మూడు రోజులుగా జరుగుతున్న గంగాభవాని ఉత్సవాలు ముగిశాయి.

అక్రమ తెల్లరాయి గుర్తింపు



తెల్లరాయి నిల్వలను పరిశీలిస్తున్న అధికారులు

సోమశిల(చేజర్ల): చేజర్ల మండలం కొల్లపనాయుడుపల్లి గ్రామ సమీపంలో భారీగా నిల్వ చేసి ఉన్న తెల్లరాయిని మంగళవారం జిల్లా విజిలెన్స్ మైనింగ్ ఏడీ బాలాజీనాయక్, సిబ్బంది గుర్తించారు. ఈ సందర్భంగా అనుమతి పొందిన పొలం అసైన్‌మెంట్ భూమిగా గుర్తించారు. ఎండీఎల్ అనుమతి పొందిన యజమాని వై.సుబ్బరత్నమ్మగా ఉండగా.. శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి మినరల్స్ పేరు మీద అనుమతి తీసుకున్నట్లు గుర్తించారు. అయితే ఇందుకు సంబంధించిన లీజుదారులు ప్రభుత్వ ఉద్యోగిగా కొల్లపనాయుడుపల్లి గ్రామంలో విధులు నిర్వహించడం గమనార్హం. మొత్తం 1,200 టన్నుల తెల్లరాయి ఉన్నట్లు గుర్తించారు. అలాగే ఎదురుగా ఉన్న మరికొంత తెల్లరాయి నిల్వలను గుర్తించి అక్కడ 350 టన్నుల తెల్లరాయి ఉందని నిర్ధారించారు. మొత్తం 1,550 టన్నుల తెల్లరాయి నిల్వ ఉన్నట్లు జిల్లా మైనింగ్ అధికారులకు తెలియజేస్తామని తెలిపారు. మైనింగ్ అధికారుల అనుమతి లేకుండా నిల్వ ఉన్న రెండు చోట్ల తెల్లరాయిని తరలించకూడదని గ్రామ వీఆర్‌ఓ, వీఆర్‌ఏను ఆదేశించారు. జిల్లా అధికారులు నివేదించిన అనంతరం తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరిస్తున్నాం



సభ్యత్వ నమోదు చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

ఆత్మకూరురూరల్: విద్యారంగ సమస్యలు పరిష్కారంలో ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం ముందంజలో ఉందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి సురేంద్ర అన్నారు. మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాల, పేరారెడ్డిపల్లి, వాశిలి, కరటంపాడు, మురగళ్ల, బట్టేపాడు స్కూల్ కాంప్లెక్స్‌ల పరిధిలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ రామిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, జిల్లా కార్యదర్శి రామసుబ్బారెడ్డి, ఏపీటీఎఫ్ నాయకులు వెంగయ్య, సాజీద్, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

పీఎం కిసాన్ నిధుల విడుదల



ఆత్మకూరురూరల్: ఎల్‌ఈడీ స్క్రీన్‌ను వీక్షిస్తున్న రైతులు

ఆత్మకూరురూరల్: పీఎం కిసాన్ నిధుల విడుదల కార్యక్రమం ఆత్మకూరు పట్టణంలోని ఎంజీఆర్ బస్‌స్టేషన్ వద్ద రైతులు ప్రత్యక్షంగా ఎల్‌ఈడీ స్క్రీన్‌పై వీక్షించారు. మద్రాస్ ఫెర్టిలైజర్ లిమిటెడ్, దేవి, శ్రీదేవి ఫెర్టిలైజర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ప్రధాని నరేంద్రమోదీ వారణాసి నుంచి రైతుల ఖాతాలో జమ చేసిన అంశాన్ని నిర్వాహకులు రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ కదుముల సుధాకర్‌రెడ్డి, మద్రాస్ ఫెర్టిలైజర్స్ రీజినల్ మేనేజర్ ఆదినారాయణస్వామి, అడిషనల్ మేనేజర్ రాము, రైతు నాయకులు తుమ్మల చంద్రారెడ్డి, సోమవరపు యానాదిరెడ్డి, వ్యాపార ప్రతినిధి కుదుముల సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యక్ష ప్రసారం

సోమశిల(చేజర్ల): చేజర్ల మండలం ఏటూరు రైతు భరోసా కేంద్రంలో పీఎం కిసాన్ నిధుల విడుదల ప్రత్యక్ష ప్రసారాన్ని రైతులతో కలిసి వీక్షించినట్లు మండల వ్యవసాయాధికారిణి శశిధర్ మంగళవారం తెలిపారు. ఆయన వెంట రైతులు ఉన్నారు.

లింగంగుంట ఆర్‌బీకేలో..

సోమశిల: పీఎం కిసాన్ నిధుల విడుదల కార్యక్రమాన్ని అనంతసాగరం మండలంలోని లింగంగుంట రైతుభరోసా కేంద్రంలో మంగళవారం మండల వ్యవసాయాధికారి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతులు వీక్షించారు.



సోమశిల: రైతులతో కలిసి వీక్షిస్తున్న వ్యవసాయాధికారులు



సోమశిల: పీఎం కిసాన్ నిధుల విడుదలను వీక్షిస్తున్న రైతులు